


టిటిడిలో భారీగా ఉద్యోగ విరమణలు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానంలో రోజురోజుకూ శాశ్వత ఉద్యోగులు గణనీయంగా తగ్గిపోతున్నారు. జూన్ 30న దాదాపు 140 మంది శాశ్వత ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఇందులో ప్రధానమైనటువంటి కీలక విభాగాల్లో ఉన్న డిప్యూటీ ఈవోలు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారులు నుండి దిగువ శ్రేణి శాశ్వత ఉద్యోగులు భారీగానే ఉద్యోగ విరమణ చేయనున్నట్టు టీటీడీ అధికారులు వెల్లడించారు. ఇంత పెద్ద ఎత్తున ఉద్యోగ విరమణ చేయడంతో ఖాళీలు కూడా భర్తీ చేయాలని టిటిడి ఉద్యోగులు కోరుతున్నారు. 36 ఏళ్ల పాటు వెంకటేశ్వర స్వామి సన్నిధిలో పలు విభాగాల్లో విధులు నిర్వహించడం పూర్వజన్మ సుకతం అని ఉద్యోగ విరమణ డిప్యూటీ ఈవో దామోదరం 'ప్రజాశక్తి'కి తెలిపారు.

'యాంత్రిక' బతుకులు



రాష్ట్ర పిలుపులో భాగంగా శనివారం పంచాయతీ కార్యదర్శుల నిరసన

పని భారం..
కుటుంబాలకు దూరం..
నిరసన తెలిపే స్వేచ్ఛా మాకు లేదా..
భగ్గుమంటున్న పంచాయతీ కార్యదర్శులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా అడకత్తెరలో పోకచెక్కలా వారి పరిస్థితి తయారవుతోంది. పంచాయతీల్లో పాలకవర్గాలకు పవర్ లేక.. సకాలంలో నిధులు విడుదల కాక.. ఉన్నా ఖర్చు చేసే దారి లేక.. అప్పులు చేసి మరీ గ్రామాల్లో పనులు చేయిస్తున్నారు కార్యదర్శులు. అయినా పంచాయతీ కార్యదర్శుల పట్ల ప్రభుత్వానికి కనీస సానుభూతి లేదు. రోజుకో కొత్త మార్గదర్శకాలను విడుదల చేస్తూ తమను యంత్రాలకన్నా హీనంగా చూస్తున్నారని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు పని వేళలున్నాయనీ, కానీ పంచాయతీ కార్యదర్శులకు ఆ వెసులుబాటు లేకపోవడం మా దురదష్టమని ఆవేదన వ్యక్తం చేస్తుండటం గమనార్హం. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు నిరంతరం పనే ధ్యాసగా బతుకుతున్నామనీ, తాజాగా ఉదయం 6 గంటలకే పంచాయతీలకు వెళ్లాలని ప్రభుత్వం మార్గదర్శకాలివ్వడం కార్యదర్శులను ఒక రకంగా కుటుంబాలకు దూరం చేయడమేనని మండిపడుతున్నారు.

యాంత్రీకరణ జీవితాలు మాకొద్దు

తిరుపతి జిల్లా వ్యాప్తంగా సుమారు 800 మందికి పైగా పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులకు నిర్ణీత పని, సమయం లేని కారణంగా కుటుంబాలపై శ్రద్ధ పెటలేకపోతున్నామని అంటున్నారు. మహిళా పంచాయతీ కార్యదర్శులకు వారి కుటుంబాలను చూసుకోవాలసిన బాధ్యత మగవారి కన్నా ఎక్కువగా వుంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ఉదయం 6 గంటలకే పంచాయతీకి పోయి ఫొటోలు పెట్టాలంటే ఇంటి దగ్గర ఉదయం 3 గంటలకే నిద్ర లేవాల్సి ఉంటుందని వాపోతున్నారు. ఇంటిపని చేసి, పిల్లల బాగోగులుచూసి, ఆ సమయానికి ఉద్యోగానికి రావాలంటే ఎంత కష్టమో ప్రభుత్వానికి అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఉదయాన్నే ఎప్పుడో విధులకు వెళ్లి రాత్రి ఆలస్యంగా వెళ్ళకు చేరుతున్నామనీ, ఫలితంగా కుటుంబ కలహాలు ఏర్పడుతున్నాయని పంచాయతీ కార్యదర్శుల ఆవేదన. ' కోటి విద్యలు..కూటి కొరకు' అన్న చందాన తామెంత కష్టపడ్డా కుటుంబం కోసం.. పిల్లల కోసమైనప్పుడు ఈ తరహా పని విధానం సహేతుకం కాదంటున్నారు. తల్లిగా, తండ్రిగా పిల్లల సంరక్షణ చేయలేకున్నామనీ, యాంత్రీకరణ జీవితాలు మాకొద్దని పంచాయతీ కార్యదర్శులు తెగేసి చెబుతుండటం గమనార్హం. పనిభారం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయనీ, ఉన్నత విద్యను అభ్యసించేందుకు అడ్డంకులు ఏర్పడుతున్నాయని అంటున్నారు.


నిరసన తెలిపే స్వేచ్ఛ లేదా!!

ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య యూనియన్ ఆధ్వర్యంలో పని భారంపై శనివారం జిల్లా కలెక్టరేట్లు, మండల పరిషత్ కార్యాలయాల వద్ద నిరసనకు పిలుపునిచ్చారు. అయితే గ్రేడ్-5, గ్రేడ్ -6 పంచాయతీ కార్యదర్శుల బదిలీ కౌన్సిలింగ్, ఐవీఆర్ఎస్ యాక్టివిటీ ఉందన్న సాకుతో విరమించాలని ప్రభుత్వ పెద్దలు ఒత్తిడి తెచ్చినట్లు కార్యదర్శులు వాపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 8 మంది గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులు మాత్రమే బదిలీ కౌన్సిలింగ్ కు వెళుతున్న నేపథ్యంలో చిన్న చిన్న కారణాలను పెద్దవిగా చూపి నిరసనలను అడ్డుకుంటున్నారని కార్యదర్శులు మండిపడుతున్నారు. ఈనెల 30వ తేదీన పెన్షన్ నగదు డ్రా చేయడం, తరువాత రోజు బట్వాడ చేయడం, ఆ తర్వాత రోజు గ్రామ సభలు పెట్టడం ఇలా చెప్పుకుంటూ పోతే 365 రోజులు పంచాయతీ కార్యదర్శులు గొడ్డు చాకిరీ చేసుకుంటూ పోవాల్సిందేనీ, సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేదెప్పుడని వారికి వారు ప్రశ్నించుకుంటున్నారు.

అయోమయంలో అకడమిక్ కన్సల్టెంట్లు

1 నుంచి ఎస్వీయూలో ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - క్యాంపస్



శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో జూన్ 16 నుంచి కళాశాలలు పున్ణప్రారంభం అయ్యాయి. ఇందులో భాగంగా వర్సిటీలో పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లకు ఎటువంటి ఆర్డర్ కాపీ లేకుండా కొంతమంది విభాగాధిపతులు కళాశాలకు రావాలని మౌఖికంగా చెప్పారు. అయితే మరోవైపు జులై 1 నుంచి ఎస్వీయూలో ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు వీసీ అప్పారావు వెల్లడించారు. దీంతో 264 మంది అకడమిక్ కన్సల్టెంట్లు అయోమయంలో, సందిగ్ధంలో పడిపోయారు. జెఎన్టియు కాకినాడ వర్సిటీలో తాత్కాలిక అధ్యాపకులకు బోధన, పరిశోధన నాణ్యత అంశంలో మూల్యంకన చేసే ఉద్దేశంతో ఇంటర్వ్యూలు నిర్వహించడం దారుణమని రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి తెరలేపారు. ఇందులో భాగంగానే గత సోమవారం అన్ని విశ్వ విద్యాలయాల నుంచి రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మండలి కార్యాలయాన్ని ముట్టడించారు. అయితే రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి అకడమిక్ కన్సల్టెంట్లకు రాష్ట్రవ్యాప్తంగా ఒకే డిజిగ్నేషన్ ఇస్తూ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆన్ కాంట్రాక్టు బేసిస్ మీద సంవత్సరానికి సంబంధించి వారి బోధన, పరిశోధనా అంశాలలో మూల్యాంకనం చేయడం జరుగుతుందని, ప్రత్యేకంగా ఇంటర్వ్యూలు ఉండవని స్పష్టం చేశారని రాష్ట్రస్థాయి నాయకులు వివిధ గ్రూపుల్లో సమాచారాన్ని ఇచ్చారు. అయితే ఇందుకు విరుద్ధంగా ఎస్వీయూలో అకడమిక్ కన్సల్టెంట్లకు బోధన, పరిశోధనా అంశాల్లో మూల్యాంకనం చేసే ఉద్దేశ్యంతో అప్లికేషన్, సర్టిఫికెట్లను పరిశీలించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి సూచన మేరకు బయటి ఆచార్యులచే మూల్యాంకన ప్రక్రియ జులై 1 నుంచి ఏడో తేదీ వరకు మౌఖిక ఇంటర్వ్యూలు వివిధ విభాగాల తాత్కాలిక అధ్యాపకుల బోధన, పరిశోధన అంశాలపై మూల్యాయనం చేయడం జరురగుతుందని వర్సిటీ ఇన్ఛార్జి విసి ఆచార్య అప్పారావు వెల్లడించారు.

సాధారణంగా అధ్యాపకుల పెర్ఫార్మన్స్ను రివ్యూ చేసేందుకు ప్రస్తుతమున్న అకడమిక్ కన్సల్టెంట్లను కు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని, మౌఖిక ఇంటర్వ్యూలో పర్ఫామెన్స్ సరిగా లేని అధ్యాపకులను తొలగించడం జరుగుతుందని వెల్లడించారు. కొత్తగా తాత్కాలిక అధ్యాపకులకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయడం లేదని, వర్సిటీలో పనిచేస్తున్న వారికి మాత్రమే వివిధ అంశాల వారీగా మూల్యాంకనం చేయడం జరుగుతుందని వెల్లడించారు. అయితే వర్సిటీలో చాలామంది అనేక మంది తాత్కాలిక అధ్యాపకులు ఇంటర్వ్యూలో పాల్గొనకుండా పరిపాలన భవనం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేయాలని అందరూ ఐకమత్యంగా ధర్నాలో పాల్గొనాలని చర్చించుకుంటున్నట్లు సమాచారం. మరి కొంతమంది ఇంటర్వ్యూలు నిర్వహించకుండా కోర్టు నుంచి స్టే ఆర్డర్ తీసుకురావాలని కోర్టుకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా పర్ఫామెన్స్ కచ్చితంగా చేసి తీరుతామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే వివిధ విభాగాల వారీగా మౌఖికంగా ఇంటర్వ్యూల తేదీని సంబంధిత విభాగాలకు పంపారు. వర్సిటీలోని అకడమిక్ కన్సల్టెంట్ల పరిస్థితి చూస్తుంటే చాలా దుర్భరంగా అయోమయం, ఆందోళనకర పరిస్థితి కనిపిస్తుంది. ఒకవైపు తమకు ఎటువంటి రెన్యువల్ ఆర్డర్ కాపీ లేకుండానే పాఠాలు చెబుతూనే మరొకవైపు ఇంటర్వ్యూ అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా లోగోట్టు పెరుమాళ్లకే ఎరుక అన్న చందంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని వివిధ విశ్వ విద్యాలయాల్లో పనిచేస్తున్న అకాడమిక్ కన్సల్టెంట్ల భవితవ్యం ఏ రూపంలో తేల్చనుందో వేచి చూడాల్సిందే.

పని గంటల్లో...
పాఠాలకే పరిమితం..!

- సమావేశాలంటూ టీచర్లను వేధించొద్దు

- విద్యాశాఖ అధికారులకు ప్రభుత్వ ఆదేశాలు

ప్రజాశక్తి - తిరుపతి

పని గంటల్లో ఉపాధ్యాయులను పాఠాలకే పరిమితం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తరచూ సమావేశాలు అంటూ ఇప్పటివరకు వేధింపులకు గురవుతున్న టీచర్లకు ఊరట లభించింది. ఉపాధ్యాయుల సమయపాలన, పాఠశాల నిర్వహణపై విద్యాశాఖ అధికారులకు నిర్దిష్టమైన మార్గదర్శకాలను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయరామరాజు తాజాగా వెలువరించారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ, ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో సిలబస్ బోధన, పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయుల విధులకు సంబంధించి పక్కాగా వ్యవహరించాలని ఆదేశాలలో జారీ చేశారు. ఈ మేరకు టీచర్లకు ఫండమెంటల్ లెర్నింగ్ పేరిట శిక్షణ ఇవ్వనున్నది. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు ప్రతిరోజూ ఉదయం తొమ్మిది గంటలకు పాఠశాలకు హాజరుకావాలని, సాయంత్రం నాలుగు గంటల వరకూ ఉండాలని ఆదేశించింది. ఉదయం 9.30 గంటలకు ఉపాధ్యాయుడు, విద్యార్థి హాజరు పూర్తిచేయాలి. ఈ ప్రక్రియ పూర్తిచేయకపోతే వెంటనే ఎంఈవో సమాచారం తెప్పించుకోవాలి. పాఠశాలలో సమావేశాలను సాయంత్రం నాలుగు గంటల తరువాత మాత్రమే నిర్వహించాలి. ప్రభుత్వ పాఠశాలల పనితీరు, విద్యార్థుల ప్రవేశంపై విమర్శలు వెల్లువెత్తుతుండడంతో పాఠశాల విద్యా శాఖ ఈ కార్యక్రమాన్ని రూపొందించిందనే వాదన వినిపిస్తోంది. విద్యార్థులకు అన్ని రకాల వస్తువులతో కిట్లు, మధ్యాహ్న భోజన పథకం కోసం కొత్తగా సన్నబియ్యం పంపిణీ చేశారు. సిలబస్లో మార్పులు చేశారు. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో టీచర్ల సమయపాలన, వారి పరితీరును మదింపుచేయాలని అధికారులు నిర్ణయించడం గమనార్హం.

కేసులు పెట్టినా భయపడం

'మా బడి మాక్కావాలి' అంటూ వేడం, పేరడంలో నిరసనలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



పేరడంలో గ్రామస్తుల రాస్తారోకో

మోడల్ స్కూల్ పేరిట చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ బడుల విలీన ప్రక్రియకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా తల్లిదండ్రులు చేస్తున్న ఉద్యమానికి మరొక గొంతు కలిసింది. మా పిల్లలను ఊరి బయటకు పంపేది లేదు.. మీరేమైనా చేసుకోండి.. కావాలంటే కేసులు కూడా పెట్టుకోండి.. మా బడి మాకు కావాలంటూ శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని వేడాం గ్రామస్తులు విద్యాశాఖాధికారులపై తిరగబడ్డారు. వివరాల్లోకి పోతే... వేడాం ప్రాథమిక పాఠశాలలో సుమారు 40 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మోడల్ స్కూల్స్-విలీన ప్రక్రియలో భాగంగా 3, 4, 5 తరగతులను సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న బీసీ కాలనీలో కలిపారు. ఫలితంగా వేడాం ప్రాథమిక పాఠశాలలో కేవలం 8 మంది విద్యార్థులు మాత్రమే మిగిలారు. దీంతో మిగిలిన వాళ్ళను తాము బడికి పంపమనీ, బడిని మూసేయాలంటూ శుక్రవారం బడి ముందు ముళ్లకంపలు వేశారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ భువనేశ్వరి శనివారం పోలీసు బలగాలతో గ్రామం వద్దకు చేరుకుని గ్రామస్తులను ఒప్పించే ప్రయత్నం చేశారు. వినకుంటే కేసులు పెడతామని హెచ్చరించారు. మా చేతుల్లో ఏమీ లేదని స్పష్టం చేశారు. దీంతో గ్రామస్తులు వారిపై తిరగబడ్డారు. 2 వేల మంది గ్రామస్తులపై కేసులు పెట్టి, జైళ్లు నింపినా మాకు భయం లేదనీ, కేసులు మాకు కొత్త కాదని గతంలో జరిగిన ఉదంతాలను ఉదహరించారు. వందేళ్ళ చరిత్ర కలిగిన వేడాం పాఠశాలకు ఉరి వేయాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు.

పేరడం గ్రామస్తుల రాస్తారోకో

ప్రజాశక్తి - సత్యవేడు

'మా బడిని వేరే స్కూల్లో విలీనం చేయొద్దు' అని సత్యవేడు మండలం పేరడం గ్రామస్తులు సత్యవేడు - ఊత్తుకోట రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. పిల్లలు అధిక సంఖ్యలో ఉన్న 3, 4, 5 తరగతులను మదనంబేడు పాఠశాలలో విలీనం చేయడం తగదన్నారు. దీనివల్ల పిల్లలు చదువుకు దూరమవుతారని వాపోయారు. ఎక్కువమంది దళిత గిరిజన పిల్లలేనని, తల్లిదండ్రులు కూలికి వెళితే, వీరు బడులకు వెళతారన్నారు. అయితే పాఠశాల దూరం కావడంతో తాము స్కూలుకు పంపించే పరిస్థితి లేదని తల్లిదండ్రులు వాపోయారు. విలీనం నిర్ణయం వల్ల తాము కూలి పనులకు వెళ్లడమైనా మానేయాలని, లేదంటే పిల్లలను స్కూలకు పంపకుండా అయినా ఉండాలన్నారు. విలీనం వల్ల రెండు కిలోమీటర్ల దూరం చిన్నపిల్లలు నడిచి వెళుతుంటే సాయంత్రానికి ఎటువంటి ప్రమాదం లేకుండా సురక్షితంగా వస్తారో లేదోననే భయంతో తాము రోజంతా గడపాల్సి ఉంటుందన్నారుర. జిల్లా విద్యాశాఖ అధికారి పున్ణపరిశీలించాలని విజఒప్తి చేశారు. ఎంఇఒకు వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. రోడ్డుపై బైఠాయించడంతో ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. మహిళలు సుమతి, రాధ, చిలకమ్మ, భూషణ, లక్ష్మి, మల్లేశ్వరి,రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఖజానా ఖాళీ



తీవ్రంగా కాసుల కసరత్తు
రూ.80 కోట్లు ఇవ్వాలని 'చెప్కో'కు ప్రతిపాదన
యుడిఎస్ ఆధునీకరణకు నిధుల లేమి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మొన్నటికి మొన్న తిరుపతి కార్పొరేషన్ నూతన కార్యాలయం పూర్తవ్వాలంటే కార్పొరేషన్ ఆస్తులు అమ్మే పరిస్థితి.. ప్రస్తుతం భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణకు 350 కోట్లు ఖచ్చితంగా కావాలి. కనీసం రూ.80 కోట్లు అయినా ఇవ్వాలని 'చెప్కో' అధికారుల వద్ద కమిషనర్ మౌర్య ప్రతిపాదించారు. నగరంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరుకుందని, మ్యాన్హోల్స్ పొంగిపొర్లడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని 'చెప్కో' దృష్టికి తీసుకెళ్లాగా, రెండు రోజుల క్రితం అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లడం గమనార్హం.

తిరుపతి కార్పొరేషన్కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఒక్క పైసా కూడా రాకపోవడంతో నిధుల లేమి అభివృద్ధికి ఆటంకంగా మారింది. ఉన్న నిధులతోనే భూగర్భ డ్రైనేజీ పనులను తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. నగర జనాభా నాలుగు లక్షలకు చేరుకుంది. 79 వేల గృహాలు ఉన్నాయి. అమృత్ 2.0 పథకంలో తిరుపతి లేకపోవడంతో కమిషనర్ మౌర్య తిరుపతి భూగర్భడ్రైనేజీ ఆధునీకరణకు నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. అందులో భాగంగానే ఢిల్లీ నుంచి ప్రజారోగ్య , పర్యావరణ ఇంజనీరింగ్ సంస్థ (చెప్కో) అడ్వైజరీ కమిటీ సభ్యులైన చౌరాసియా, అమిత్ బందం వచ్చి తిరుపతి నగరాన్ని సందర్శించి భూగర్భ డ్రైనేజీ ఎక్కడెక్కడ దెబ్బతినింది పరిశీలించింది. రేణిగుంట తూకివాకం వద్ద ఉన్న మురుగునీటి శుద్ధి ప్లాంటును పరిశీలించింది. తిరుపతి నగరంలో దెబ్బతిన్న భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించిన తర్వాత కొంత నిధులు ఇవ్వడానికి సిద్ధపడ్డారు. మెయిన్ పైప్ లైన్ మార్చడానికి సుమారు 40 కోట్ల రూపాయలు ఇచ్చేందుకు కమిటీ సభ్యులు అంగీకరించారు. అయితే కమిషనర్ మౌర్య మాత్రం మెయిన్ పైప్ లైన్ మార్చడానికి సుమారు 100 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని 80 కోట్లయినా ఇవ్వాలని పేర్కొన్నారు. అందుకు కమిటీ సభ్యులు కేంద్ర ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లేందుకు డీటెయిల్స్ ప్రాజెక్టు తయారు చేసి పంపాలని సూచించారు. 80 కోట్లకు సంబంధించిన డీటెయిల్స్ ప్రాజెక్టును ఇంజనీరింగ్ అధికారులు త్వరలో సిద్ధం చేయనున్నారు. దీంతో పాటు మరో పథకంలో కూడా సుమారు 100 కోట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి తెచ్చుకోవడానికి నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.



'చెప్కో' బృందం పరిశీలన (ఫైల్)

కలెక్టర్ను కలిసిన జిల్లా ప్రజారవాణాధికారి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఆర్టిసి జిల్లా ప్రజారవాణాధికారి జగదీష్ మర్యాదపూర్వకంగా శనివారం కలెక్టర్ వెంకటేశ్వర్ను కలిసారు. శాలువాతో కలెక్టర్ను సత్కరించారు. ఆర్టీసీ వ్యవస్థ బలపడేందుకు జిల్లా కలెక్టర్గా సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ రాష్ట్రంలోనే నంబర్ వన్గా రవాణా సంస్థ ఉండాలని ఆకాంక్షిస్తున్నానని చెప్పారు.

పరిమితికి మించి రవాణా చేయొద్దు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

విద్యార్థులను స్కూళ్లకు తరలిస్తున్న ఆటోవాలాలు పరిమితికి మించి రవాణా చేయరాదని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది. స్కూలు బస్సుల్లో గానీ, ఆటోల్లో గానీ పరిమితికి మించరాదన్నారు. మితిమీరిన వేగంతోనూ నడపరాదని సూచించారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల చిన్న వయస్సులోనే విద్యార్థులు మృత్యువాత పడుతున్న ఘటనలు అనేకం ఉన్నాయని, గమనించి స్కూలు యాజమాన్యంతో పాటు ఆటోవాలాలు పోలీసు నిబంధనలను అమలు చేయాలని పేర్కొంది. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తుడా అభివృద్ధికి సహకరించండి



ప్రజాశక్తి -తిరుపతి టౌన్


తుడా అభివృద్ధికి అన్ని విధాల తోడ్పటును అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ను తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి కోరారు. శనివారం కలెక్టరేట్ లో జిల్లావృకలెక్టర్ వెంకటేశ్వర్ను డాలర్స్ దివాకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్కు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం తుడా భివృద్ధిపై చర్చించారు. తుడా పరిధిలో చేస్తున్న అభివృద్ధి పనులను కలెక్టర్కు వివరించారు. తుడా పరిధిలోని అన్ని నియోజకవర్గాలలోని గ్రామాలు, పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని తుడా చైర్మన్ వివరించారు. అందుకు అవసరమయ్యే ఆదాయ వనరులపై దష్టి సారించామన్నారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ తుడా అభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

భాస్కర్ నాయుడుకు కోబ్రా పాము కాటు

ప్రజాశక్తి - రేణిగుంట టీటీడీ రిటైర్డ్ ఉద్యోగి, తిరుమల ప్రాంతానికి చెందిన ప్రఖ్యాత సర్పాలు పట్టే భాస్కర్ నాయుడు (68) రేణిగుంట మండలం కరకంబడి అమర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జూన్ 27వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2.15 గంటలకు చేతికి విషపూరిత కోబ్రా పాము కాటుకు గురవడంతో తీవ్రమైన ఆరోగ్య స్థితిలో ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం మెడికల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో చికిత్స పొందుతున్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



విలేకరుల సమావేశంలో వి.నాగరాజు

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమయ్యిందని, ముఖ్యంగా మామిడి రైతులను ఆదుకోవడంలో వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. శనివారం వేమన విజ్ఞాన కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఉన్న మామిడి రైతులకు భరోసా కల్పించాలిన ప్రభుత్వం ఆ దిశగా చర్యల్లేవన్నారు. ఫ్యాక్టరీల వద్ద రైతులు మామిడికాయలు అమ్ముకోడానికి 40 గంటలు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారుర. కిలో రూ.12కు కొనుగోలు చేయాలని ప్రభుత్వం మద్దతుధర ప్రకటించినా, ఎక్కడా ఫ్యాక్టరీ యాజమాన్యం అమలు చేయలేదన్నారు. పాఠశాలల విలీనం పేరుతో పేదలకు చదువు దూరం చేయొద్దని, ప్రతిపాదనను విరమించుకోవాలని సూచించారు. శెట్టిపల్లి భూ సమస్య పరిష్కరించడంలో మీనమేషాలు తగదన్నారు. స్విమ్స్లో కార్మికుల వేతనాలు పెంచాలనే డిమాండ్తో జరుగుతున్న దీక్షలకు సిపిఎం మద్దతు ఉంటుందన్నారు. జిల్లాలో మట్టిని తవ్వి కొండలను చీల్చి, వేలాది ట్రిప4లు టిప్పర్లతో తోలుతున్నా అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో జిల్లా నేతలు జయచంద్ర, కెఆర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నేషనల్ మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలి : ఎంపి

ఆంధ్రప్రదేశ్లో మామిడి రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్కు తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి లేఖ రాశారు. దేశంలోనే అత్యధికంగా 12.35 లక్షల ఎకరాల్లో రాష్ట్రంలో మామిడి సాగవుతుందన్నారు. విస్తీర్ణంలో అగ్రస్థానంలో ఉన్నా, ఉత్పత్తిలో రెండో స్థానంలో ఉండటం సాగుపరంగా పలు మౌలిక సమస్యలను సూచిస్తోందన్నారు. చిత్తూరు జిల్లాలో విస్తారంగా సాగయ్యే తోతాపురి మామిడి ధర భారీగా క్షీణించడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ధర రూ.12 ఉన్నప్పటికీ కేవలం కిలో రూపాయి నుంచి నాలుగు రూపాయలకు అమ్ముకునే పరిస్థితి ఉందన్నారు. చిత్తూరు - తిరుపతి ప్రాంతంలో ఉన్న 52 మామిడి ప్రాసెసింగ్ యూనిట్లలో 28 యూనిట్లు మూతబడినట్లు వివరించారు. తిరుపతిలో నేషనల్ మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లాలో జాతీయ మామిడి పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేసి పంట దిగుబడి మెరుగుదల, తెగుల నివారణ, వాతావరణ అనుకూల సాగు పద్ధతులపై పరిశోధనలు చేయాలని కోరారు.

పండ్లల్లో రారాజు...ధర బేజారు..

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి ధర చిన్నబోతోంది. జిల్లాలో మామిడి పంట సంక్షోభంలో పడింది. దిగుబడి గణనీయంగా పెరగడంతో రైతుల్లో ఆనందం వికసించినా ధరలు ఉస్సూరు మనిపిస్తున్నాయి. ఫలరేడు (పండ్ల రాజు)గా పేరుగడించిన మామిడికి నేడు ధరల పతనం చేదు అనుభవాన్ని అందిస్తోంది. మద్దతు ధర ఖచ్చితంగా ఇస్తామని చెప్పిన అధికారులు, వాటి అమల్లో మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. దీంతో రైతులు పంటను రోడ్డు పాలు చేసి, దీనంగా జీవితాలు సాగిస్తున్నారు.

తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలానికి చెందిన దామల్చెరువు మామిడి మార్కెట్ ప్రసిద్ధి. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో 1.10 లక్షల ఎకరాల్లో మామిడితోటలు సాగులో ఉన్నాయి. వాటి నుంచి ఏటా ఐదు లక్షల టన్నులు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం అధికారుల అంచనా ప్రకారం 39,985 హెక్టార్లలో తోతాపురి, నీలం, అప్పోన్స్, బేనీషా, మల్లిక రకాలకు చెందిన మామిడి తోటలు సాగులో ఉన్నట్లు వ్యవసాయ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది రాష్ట్రంలో కృష్ణా జిల్లా తరువాత అధిగ దిగుబడి చిత్తూరు జిల్లాలోనే అని వ్యవసాయ నిపుణుల అంచనా. ఉమ్మడి జిల్లాలో పడమటి మండలాల్లో అధికంగా మామిడి సాగు ఉంది. ప్రధానంగా పల్ప్ పరిశ్రమలకు అవసరమైన తోతాపురిరకం మామిడిని అధికంగా సాగు చేస్తారు. ఉమ్మడి జిల్లాలో 52 మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. కొన్ని యూనిట్లు పూర్తిగా మూతపడ్డాయి. అందుబాటులో ఉన్న 47 మామిడి గుజ్జుపరిశ్రమల్లో 39 పరిశ్రమలు మాత్రమే తెరవబడ్డాయి. అందులో 35 పరిశ్రమలు పూర్తిస్థాయిలో పని చేస్తున్నాయి. గత రెండేళ్లతో పోల్చితే మామిడి దిగుబడే కాదు. నాణ్యత కూడా మెరుగ్గా ఉంది. కానీ రైతులకు మాత్రం ధర లేక ఇబ్బందులు పడుతున్నారు. మామిడి టన్ను ధర భారీగా పతనమైంది. పంటకోసుకెళ్లి మార్కెట్ ఇస్తే కూలీ డబ్బులు కూడా రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు వారాల క్రితం తోతాపురి మామిడి రూ.6 నుంచి రూ.8 వరకు పలికేది. ధరలు తక్కువ కావడంతో అనేక ప్రాంతాల్లో రైతులు పంటను రోడ్డు పక్కన పారబోసి వెళ్లారు. సదుం మండలంలో ఇది ఎక్కువుగా జరిగింది. మామిడి రైతులను ఆదుకుంటాం అని ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా కలెక్టరు సైతం దామలచెరువు మార్కెట్ మండీని పరిశీలించారు. అనేక సార్లు స్థానిక ఎంఎల్ఏ, అధికారులు వెళ్లి పరిశీలించారు. మామిడికి మద్దతు ధర ఇస్తామని ప్రకటించారు. కిలో రూ.12కు కొనుగోలు చేయాలని సూచించారు. అధికారుల బలవంతం వల్ల వ్యాపారులు సరేనని చెప్పినా, చేతల్లో మాత్రం చూపడం లేదు. గురు, శుక్రవారాల్లో దామలచెరువు మండిల్లో ధర కిలో రూ.2.50పైసలు పలకడం గమనార్హం. ఐదు టన్నుల పంట కోసి, మార్కెట్ కు తరలించాలంటే రైతుకు 12 నుంచి 15వేల ఖర్చు అవుతోంది. ప్రస్తుత ధర ప్రకారం ఐదు టన్నులకు 12,500 వస్తుంది. పంట కోసి, మార్కెట్కు వెళ్లితే రైతుకు మూడు వేలు చేతునుంచి పడుతోంది. దీంతో రైతులు పంటను చెట్లలోనే వదిలేస్తున్నారు, కొంత మంది తర్వాత ఏడాది పంట దిగుబడి తగ్గుతుందని, పంటకోసం రోడ్డుపక్కన పారబోస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి,పూర్తి స్థాయిలో తాము చెప్పిన కిలో 12 రూపాయలు మద్దతు ధర అమలు అయ్యేలా చేసి, జిల్లాలోని పల్ప్ ఫాక్టరీలు పూర్తిస్థామర్ధ్యంతో పని చేసే విధంగా చర్యలు తీసుకుంటే మామిడి రైతులు కొంత ఊరట చెందుతారు. ఆ దిశగా అధికారులు చర్యలు లేవు. జిల్లా కలెక్టరు స్పందించి, వ్యాపారులు, అధికారులను సమన్వయ పరిచి రైతులను అదుకోవాలని మామిడి రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం..!

వడివడిగా 'నడికుడి - శ్రీకాళహస్తి' పనులు

- నడికుడి - శ్రీకాళహస్తి మధ్య యుద్ధ ప్రాతిపదికన రైల్వే ట్రాక్ నిర్మాణ పనులు
- ఇక హైదరాబాదుకు దగ్గర ప్రయాణం

హైదరాబాదు నగరం నుంచి తిరుపతికి మరో కొత్త రైల్వే లైను రానుంది. అదే నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే మార్గం. ఈ పనులు పూర్తి చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాయి. కోర్టు కేసులు, రైతులకు నష్టపరిహారం అన్ని పరిష్కరించుకొని రైల్వే లైన్ ముందుకు సాగుతోంది. త్వరలోనే ఈ రైల్వే లైన్‌ను కేంద్ర ప్రభుత్వం జాతికి అంకితం చేయనుంది. - ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



ప్రకాశం జిల్లాలో భూసేకరణ సమస్యలు పరిష్కారం కావడంతో రైలు మార్గం నిర్మాణం మరింత వేగవంతం కానుంది. ఎన్నో దశాబ్దాలుగా నత్తనడకన సాగుతున్న ఈ ప్రాజెక్టుకు భూసేకరణ, నిధుల కొరత ప్రధాన సమస్యలుగా మారగా.. కేంద్రం ఈ రైలు మార్గాన్ని 'ప్రగతి' కార్యక్రమంలో చేర్చి, ప్రధానమంత్రి కార్యాలయం ద్వారా ప్రతి 100 రోజులకు ఒకసారి సమీక్షించింది. దీంతో అధికారులు భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను పరిష్కరించారు. ఈ నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ పల్నాడు, పశ్చిమ ప్రకాశం ప్రాంతాల అభివృద్ధికి కీలకంగా మారింది. ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం కూడా టార్గెట్ పెట్టుకుంది. ఈ క్రమంలోనే జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ భూసేకరణపై ఫోకస్ పెట్టారు. భూసేకరణపై ఎప్పటికప్పుడు నివేదికలు అందజేశారు. ఈ రైల్వే లైనుకు సంబంధించి ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతాలైన దర్శి, పొదిలి, కనిగిరి, పామూరు, కురిచేడు ప్రాంతాల్లో భూముల సేకరణలో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ రైలు మార్గం వెళ్లే భూముల యజమానులకు సరైన పత్రాలు లేకపోవడం, చనిపోయిన వారి పేర్ల మీద భూములు ఉండటం ఇబ్బందిగా మారింది. ఈ భూ సమస్యల వల్ల పరిహారం పంపిణీ ఆలస్యమైంది. అలాగే కొన్ని భూములపై కోర్టు కేసులు కూడా నడిచాయి. మొత్తానికి రెవెన్యూ శాఖ అధికారులు ప్రత్యేకంగా ఫోకస్ పెట్టి ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ విషయానికి వస్తే హైదరాబాద్ నుంచి తిరుపతి ప్రయాణ సమయం తగ్గనుంది. అంతేకాదు కొత్తగా మరికొన్ని రైళ్లు కూడా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది.

ప్రస్తుతం హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లడానికి మూడు రైల్వే మార్గాలు ఉన్నాయి. ఒకటి హైదరాబాద్ టు తిరుపతి వయా వరంగల్, ఖాజీపేట, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట తిరుపతి. మరో రూట్ హైదరాబాద్ టు తిరుపతి వయా నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, గుంటూరు, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా తిరుపతి వెళ్లొచ్చు. మరో రూట్ హైదరాబాద్ టు తిరుపతి వయా షాద్‌నగర్, గద్వాల్, కర్నూలు, గుత్తి, గుంతకల్లు, కడప, రేణిగుంట మీదుగా తిరుపతి వెళ్లొచ్చు.

ఈ నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే.. హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లేందుకు దూరం తగ్గుతుందంటున్నారు. హైదరాబాద్ టు నడికుడి.. అక్కడి నుంచి ప్రకాశం, నెల్లూరు జిల్లాల మీదుగా తిరుపతికి వెళ్లొచ్చు.

ఔట్సోర్సింగ్ ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు విజయ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆరవ రోజు కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గణేష్ కుమార్ మాట్లాడుతూ చాలీ చాలని జీతాలతో సతమతమవుతున్న లక్షలది ఔట్సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఔట్ సోర్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తి దారుల సమాఖ్యతో మెరుగైన ఫలితాలు



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, వెలుగు కార్యాలయంలో శనివారం రైతు ఉత్పత్తి దారుల సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథి, మండల వ్యవసాయశాఖ అధికారి షణ్ముగం మాట్లాడుతూ రైతు ఉత్పత్తి దారులు సమాఖ్య ద్వారా సభ్యులకు ఎప్పటికప్పుడు వ్యవసాయ అనుబంధ రంగాలలో మెలకువలు, పద్ధతులు, ప్రభుత్వం అందించే పథకాలు సమాచారం పొంది మెరుగైన ఫలితాలు పొందవచ్చన్నారు. ఏపియం మునెయ్య మాట్లాడుతూ రైతులు వీలైనంత వరకు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించి పెట్టుబడి ఖర్చులు తగ్గించడమే కాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో సీసీలు వెంకటరత్నం, వీరయ్య, వయని రైతు ఉత్పత్తి దారులు సంఘాలు లీడర్లు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: స్థానిక ఎస్కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివ ప్రసాద్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల మత్తులో పడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ పీర్ కుమార్, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ సురేంద్ర, కిరణ్మయి, శ్రీధర్ శర్మ, తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఏఈగా రమణయ్య



ప్రజాశక్తి - తొట్టంబేడు: మండల హౌసింగ్ ఏ.ఈ గా రమణయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో శ్రీకాళహస్తి అర్బన్ హౌసింగ్‌లో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా తొట్టంబేడు హౌసింగ్ ఏఈగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు గృహ నిర్మాణ సంస్థ తరఫున ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. గత కొంతకాలంగా శ్రీకాళహస్తి రూరల్ మండలం హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యం ఇంచార్జ్ ఏఈగా ఉన్నారు.

అంగన్వాడీలో అక్షరాభ్యాసం



ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని పంగూరు పంచాయతీ, కాట్రకాయల గుంట అంగన్వాడీలో "అంగన్వాడీ పిలుస్తోంది" కార్యక్రమాన్ని నిర్వహించి, చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో కాట్రకాయలగుంట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కల్పన 3 సంవత్సరాలు నిండిన బాలబాలికలను అంగన్వాడీలో చేర్పాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఐదు సంవత్సరాలు పూర్తయిన పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ హెల్పర్ లీలావతి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రజాశక్తి - వరదయ్యపాలెం: ప్రమాదం జరిగితే గాని స్పందించరా..? నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గ్యాస్ పైప్ లైన్ కాంట్రాక్టర్, ఇతనికి ఉతమిచ్చేలా(?) సహకారం అందిస్తున్న మండల అధికారులు. గత కొన్ని రోజులుగా వరదయ్యపాలెం పంచాయతీలో జరుగుతున్న గ్యాస్ పైప్ లైన్ పనులు ప్రమాదకర స్థాయిలో నిర్వహిస్తూ స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇదేమని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతున్నారు. శనివారం నివాస గృహాల సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు దగ్గరగా వెల్డింగ్ పనులు చేశారు. గృహ సముదాయాల మధ్య ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కూడా ఈ సమస్యను పట్టించుకోనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రమాదానికి తావు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నాగ పడగలకు వెండి బహూకరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి గుంతకల్లుకు చెందిన జిఎస్ రాజు దంపతులు శనివారం వెండిని వితరణగా అందజేశారు. సుమారు 4.470 కిలోల వెండిని ఈవో బాపిరెడ్డికి అందజేసి నాగ పడగల తయారీకి వినియోగించాల్సిందిగా దాతలు కోరారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవార్ల దర్శనం చేయించారు. పీఆర్వో మోహన్, రవి, అర్చకులు బాలాజీ పాల్గొన్నారు.

ఎంపీ గురుమూర్తికి సన్మానం



ప్రజాశక్తి - తొట్టంబేడు: తొట్టంబేడు మండల వైయస్సార్సీపీ మండల అధ్యక్షులు కోగిల సుబ్రహ్మణ్యం ఎంపీ గురు మూర్తిని శనివారం తిరుపతిలో ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వ కంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భం గా కోగిల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కేంద్రం నుంచి వచ్చే నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సంపంగి(?) అధ్యక్షులు నాగోలు వెంకటరమణారెడ్డి, సర్పంచులు నాగరాజు, తిరుపాల్, సుబ్బు, మనీ తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణకు మందు

ప్రజాశక్తి - దొరవారిసత్రం: రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ నిర్వహిస్తున్న నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా శనివారం దొరవారిసత్రం మండలంలోని కుప్పారెడ్డిపాలెం, బుడూరు గ్రామాల్లో నట్టల నివారణ మందు జీవాలకు తాగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాదిరెడ్డి గోపాల్ రెడ్డి, మండల పశువైద్యాధికారి డాక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

ఏపిఎంసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: జిల్లా స్థాయిలో డాక్టర్ల రిజిస్ట్రేషన్, రీ రిజిస్ట్రేషన్ సేవలు, శాశ్వత రిజిస్ట్రేషన్‌కు తప్ప మిగిలిన అన్నీ రకాల సేవాల కోసం విజయవాడకు వెళ్లాల్సిన అవసరం లేకుండా జిల్లాలోనే తిరుపతిలో ఆంధ్ర ప్రదేశ్ వైద్య మండలి ఆధ్వర్యంలో రెండు రోజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ శనివారం ప్రారంభించారు. ఎస్వీ మెడికల్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ రిజిస్ట్రేషన్ తిరుపతిలో ప్రారంభించడం శుభ పరిణామం అన్నారు. ఈ సేవలను జిల్లాలోని సీనియర్ వైద్యులు, వైద్యులు, వైద్య విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి చైర్మన్ డాక్టర్ శ్రీహరి రావు మొట్టమొదటిసారిగా రిజిస్ట్రేషన్లకోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరి రావు మాట్లాడుతూ ఇదివరకే స్లాట్‌లో నమోదు చేసుకున్న వారికి శని, ఆదివారం తిరుపతిలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వి రవికుమార్, రుయా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ జె.రాధా, ప్రసూతి వైద్యశాల సూపరిటెండెంట్ డాక్టర్ ప్రమీల, ఐఎంఏ తిరుపతి విభాగం డాక్టర్ జనార్ధన్, డాక్టర్ వాసుదేవ నాయుడు, డాక్టర్ యుగంధర్, విజయవాడ నుండి ఆంధ్రప్రదేశ్ వైద్యం మండలి సిబ్బంది, ఎస్ వి వైద్య కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

'బీసీల ఆత్మ గౌరవ భరోసా'ను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): బీసీలకు సముచిత ప్రాధాన్యతను కల్పించాలనే ఉద్దేశంతో 6వ తేదీ నిర్వహించనున్న బీసీల ఆత్మగౌరవ భరోసా సభను విజయవంతం చేద్దామని ఏపీ బీసీ సంక్షేమ సంఘం నగర అధ్యక్షులు వడ్ల జగదీష్ ఆచారి, జిల్లా నాయకులు ఆవులపాటి బుజ్జి బాబు, సోము బీసీ నాయకులకు, యువతకు పిలుపునిచ్చారు. శనివారం తిరుపతి నగర పరిధిలోని ఓ ప్రైవేటు హోటల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. సభలో వక్తలు మాట్లాడుతూ ఈ సభకు ఐదు మంది మంత్రులు హాజరుకానున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ ఆచారి, విజయ్ ఉత్తరాది, రఘునాథ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ముగింపు సందర్భంగా సేవా కార్యక్రమం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఐ.సి.ఎస్ రోడ్డు వద్ద ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో 3 నెలలు పాటు నిరంతరాయంగా చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శనివారం ఈ చలివేంద్రం ముగింపు సందర్భంగా 500 మందికి గుగ్గిళ్ళు, పులిహోర అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం చలివేంద్రం నిర్వహిస్తున్నామని తెలిపారు.

రైతులు స్థిరమైన దిగుబడులు సాధించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : వాతావరణ అనుకూలిత యాజమాన్య పద్ధతుల ద్వారా వ్యవసాయ రంగంతో పాటు పశుగ్రాస పంటలలో కూడా స్థిరమైన దిగుబడులు సాధించడానికి వీలు కలుగుతుందని శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం ఉపకళపతి డాక్టర్ జేవి రమణ తెలిపారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన "వ్యవసాయంలో సవాళ్లు వాతావరణ అనుకూలిత నూతన ఆవిష్కరణలు" అనే జాతీయ సదస్సు ముగింపు సభ శనివారం వెటర్నరీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ పివి సత్యనారాయణ, డీలర్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ డాక్టర్ ఏవి రమణ, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ వి సుమతి తదితరులు పాల్గొన్నారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆర్.కె.అబాకస్ సంస్థ వారు 567 మందితో సామూహికంగా గణిత విలువలు పెంపొందించే విధానంపై ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ గోడపత్రికను తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. తుడా కార్యాలయంలో తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి చేతుల మీదుగా గేట్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు, అపుస్మా రాయలసీమ రీజినల్ ప్రెసిడెంట్, విశ్వం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్ విశ్వనాథ రెడ్డి, ఆర్. కె సంస్థల చైర్మన్ డాక్టర్ ఆర్ కె రెడ్డి కలిసి ఆవిష్కరించారు.

నాణ్యమైన భోజనం అందించండి

ప్రజాశక్తి - క్యాంపస్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టల్స్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన వసతి కల్పించాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి భరత్ కుమార్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నారాయణ గౌడ్ మాట్లాడుతూ బీసీ హాస్టల్ విద్యార్థుల పట్ల అధికారులు నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తున్నారన్నారు. ఇటీవల శ్రీకాళహస్తిలో బీసీ హాస్టల్‌లో విద్యార్థులు పులిసిన ఇడ్లీలు తినడం వలన అస్వస్థకు గురయ్యారని గుర్తు చేశారు. గతంలో ఏర్పేడులో బీసీ హాస్టల్ విద్యార్థులు అక్కడ రెగ్యులర్ వార్డెన్ లేక సరైన సదుపాయాలు అందకపోవడంతో అస్వస్థకు గురయ్యారన్నారు. కావున అధికారులు విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వసతుల ఏర్పాటు పరిశీలించాలని కోరామన్నారు.

అలరించిన గణిత అష్టావధానం

ప్రజాశక్తి - రేణిగుంట: తారకరామానగర్‌లోని పాఠశాలలో శనివారం వేమన విజ్ఞాన కేంద్రం, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ సంఖ్యాకశాస్త్రవేత్త మహలనోబీస్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ శివప్రసాద్ అష్టావధానం ఆద్యంతం విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆకట్టుకుంది. ఎనిమిది మంది వృశ్చికలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నాగార్జున, జెవివి జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప మాట్లాడుతూ గణితం పట్ల ఆసక్తిని పెంచడం, భయాన్ని తొలగించడం ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి, ఉపాధ్యాయులు నరేంద్ర, అనిత, మధు, జెవివి నాయకులు బిర్లానాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు వినూత్న రీతిలో బోధన

ప్రజాశక్తి - తొట్టంబేడు : మండలంలోని దిగువ సాంబయ్యపాలెం ఫౌండేషన్ పాఠశాలలోని విద్యార్థులకు ఆ పాఠశాల ఉపాధ్యాయులు కయ్యూరి బాలసుబ్రమణ్యం శనివారం ఆట విడుపుగా విద్యార్థులకు విన్నుత రీతిలో బోధన చేశారు. మాట్లాడే బొమ్మతో విద్యార్థులకు అక్షరాలు పరిచయం చేస్తూ వెంట్రిలాక్విజం చేశారు. అట్టముక్కలతో అక్షరాలను తయారుచేసి బొమ్మతో చెప్పిస్తూ మిమిక్రీ చేశారు. విద్యార్థులు ఆనందంతో కేరింతలు వేస్తూ అక్షరాలు నేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కల్పన, వైస్ చైర్మన్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

మహా న్యూస్ కార్యాలయంపై దాడి అనైతికం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తెలుగు రాష్ట్రాలలో ప్రముఖ మీడియా ఛానల్‌గా గుర్తింపు పొందిన హైదరాబాద్ మహా న్యూస్ ప్రధాన కార్యాలయంపై శనివారం కొంతమంది దాడి చేయడం విధ్వంసానికి అనైతిక చర్యని టీడీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.ఎం.ఉమేష్ రావు అన్నారు. ప్రజావాణి వినిపించే మీడియాపై దాడిని ప్రజాస్వామ్యంపై దాడిగానే పరిగణించాలని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు కాపలాదారుగా భావించే మీడియా రంగాన్ని భయభ్రాంతులకు గురి చేసి లొంగదీసుకోవాలనుకునే వారి దుశ్చర్యలను అందరూ ఖండించాలని కోరారు.

రుయాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు అనుమతి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి రుయా ఆసుపత్రి, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అనుమతులు మంజూరు చేసింది. రుయా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి ఎం ఎల్ ఏ ఆరణి శ్రీనివాసులు అధ్యక్షతన శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాల సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. మానసిక ఆరోగ్య విభాగం, కీళ్ల ఎముకల విభాగంలోనూ, డ్రైనేజీ పనుల నిమిత్తము రూ 16 లక్షల మంజూరు, అంబులెన్స్‌కి కొత్త డ్రైవర్ నియామకానికి అనుమతి, క్యాన్సర్ శస్త్ర చికిత్సలకు కావలసిన పరికరాల కొనుగోలుకు రూ 10 లక్షలు మంజూరు, హాస్పటల్ రోగుల నిమిత్తం డయాలసిస్ మిషన్ కొనుగోలుకు రూ 8 లక్షల మంజూరు, ప్రసూతి ఆసుపత్రిలో డ్రైనేజ్ రిపేర్లకు రూ 10 లక్షల మంజూరు, రోగులు, వారి సహాయకుల నిమిత్తం 4 పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి రూ 10 లక్షల మంజూరు, రోగులకు ఆసుపత్రి పరిధిలో రవాణా సౌకర్యానికి బ్యాటరీ వాహనం మంజూరు, ఆసుపత్రిలో క్రొత్త సిసి రోడ్లు నిర్మాణానికి అనుమతుల, లేబరేటరీ ఆధునీకరణకు ఆటోమేటిక్ మిషన్ కొనుగోలుకు అనుమతి మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి ప్రభు, రుయా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ జె. రాధ, ప్రసూతి ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ప్రమీల, రుయా హాస్పిటల్ అడ్మిన్ అధికారి కనక నరసారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.బాలకృష్ణ నాయక్, డి.సి.హెచ్.ఎస్. డాక్టర్ ఆనందమూర్తి, ఆసుపత్రి కమిటీ సభ్యులు, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

రుయాలో స్పెషాలిటీ సర్వీసులు ప్రారంభించాలి : చింతా మోహన్

రుయాలో కిడ్నీ, గుండె సూపర్ స్పెషాలిటీ సర్వీసులు ప్రారంభించాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ డిమాండ్ చేశారు. రుయా వద్ద శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రుయా ఆసుపత్రి అభివృద్ధిని విస్మరించడం సరైనది కాదన్నారు. నిరుపేదలు ఎక్కువగా రుయా ఆసుపత్రికి వైద్యం కోసం వస్తుంటారని, ఈ ఆసుపత్రిని నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రుయా ఆస్పత్రిలో గుండె, కిడ్నీ జబ్బులకు ఉచితంగా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి గౌడ్, తేజోవతి, రావణ్, వీరమోహన్, మణి, సమీ ఉల్లా, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి గుంటను పరిశీలించిన ఐఐటి నిపుణులు



మంచి నీటి గుంటను పరిశీలిస్తున్న కలెక్టర్, కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: 'మంచినీళ్ల గుంట మురికిగుంటగా మారిందని 'ప్రజాశక్తి'లో వార్త ప్రచురితం అయ్యింది. ఈ నేపథ్యంలో శనివారం కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య, కార్పొరేటర్ నరసింహాచారిలు ఐఐటి నిపుణులతో కలిసి సందర్శించారు. మంచినీళ్లగుంట సమస్య చాలా తీవ్రంగా ఉందని, శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని కలెక్టర్ చెప్పారు. టిటిడి సహకారాన్ని కోరనున్నట్లు చెప్పారు. ఒకప్పుడు తిరుపతి ప్రజల దాహార్తి తీర్చిన మంచినీళ్లగుంటను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్పొరేషన్ వద్ద నిధులు లేకపోవడంతో టిటిడి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంచినీళ్లగుంట ప్రక్షాళనకు కృషి చేస్తామన్నారు. ఐఐటి నిపుణులు నివేదిక ఇచ్చిన తరువాత ఎలా అభివృద్ధి చేయాలో ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి : కమిషనర్

నగరంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. శనివారం స్మార్ట్‌సిటీలో భాగంగా వినాయకసాగర్ అభివృద్ధి పనులను, పెండింగ్‌పనులను స్మార్ట్‌సిటీ, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. వినాయకసాగర్‌లో స్విమ్మింగ్‌పూల్, గ్లోగార్డెన్ పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కొర్లగుంట వద్ద జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్ ఆంజనేయులు, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్ ఉన్నారు.

న్యాయమైన సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: స్విమ్స్ కార్మికుల రిలే నిరాహార దీక్షలు శనివారం మూడో రోజుకు చేరుకున్నాయి. స్విమ్స్ ప్రాంగణంలో దీక్షా శిబిరానికి రిటైర్డ్ జిల్లా జడ్జి గుర్రప్ప వచ్చి కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యంలు మాట్లాడుతూ స్విమ్స్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని లేని పక్షంలో సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. కార్మికుల సమస్యలను టీటీడీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన సానుకూలంగా పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ నాయకులు లాయర్ మురళి, వేణుగోపాల్, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి మాధవ్, నగర కార్యదర్శి బుజ్జి, స్విమ్స్ కార్మికులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో అన్నమయ్య సంకీర్తనలు

ప్రజాశక్తి - సత్యవేడు: శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన 'అన్నమయ్య పదామృత వర్షిణి' కార్యక్రమం సంగీత ప్రియులకు వీనుల విందు చేసింది. హైదరాబాద్‌కు చెందిన ప్రఖ్యాత అన్నమాచార్య పండితుడు గంధం బసవ శంకరరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ అన్నమాచార్య రచనలు ప్రజలను జాగృతం చేసే బోధనలన్నారు. అనంతరం తిరుపతి శ్వేతా మాజీ డైరెక్టర్ భూమన్, ఎస్‌కె యూనివర్సిటీ మాజీ ఉప కులపతి కుసుమ కుమారి కళాకారులను ఘనంగా సత్కరించారు.

వృత్తి శిక్షణతో మహిళలకు ఆర్థిక చైతన్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్రీయ సేవ సమితి, పుత్తూరు శాఖ కార్యాలయంలో శనివారం జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో వృత్తి శిక్షణలు కార్యక్రమాలు నిర్వహించారు. టైలరింగ్, ఆర్య వర్క్‌ల్లో 80 రోజుల వ్యవధిలో రోజుకు మూడు గంటల పాటు మహిళలకు ఉచితంగా శిక్షణ అందించడమే కాకుండా, దీనికి అవసరమైన వస్తువులను ఉచితంగా అందించడం, ధ్రువీకరణ పత్రాలను అందించనున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేఎస్ఎస్ డైరెక్టర్ డాక్టర్ మోహన్ విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు ఈ శిక్షణ తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెఎస్ఎస్ అధికారి హరి, రాస్ అధికారులు రవి, తేజ, మీనా, జయంతి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఎనిమిదిమందికి గాయాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గుర్తు తెలియని వాహనం ఢీకొని, ఆటో నీటి గుంటలో బోల్తా పడగా అందులో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది ప్రయాణీకులు స్వల్పంగా గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదం శనివారం రాత్రి శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని కోళ్లఫారం వద్ద చోటు చేసుకుంది. తొండమనాడుకు చెందిన ఓ కుటుంబం ఆటోలో ఏర్పేడుకు వెళ్లి తిరిగి వస్తుండగా మదనపల్లి–నాయుడుపేట జాతీయ రహదారి కోళ్ల ఫారం వద్ద ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను108లో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

క్రైం న్యూస్

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణ పరిధి, వెంకటేశ్వర హాస్పిటల్‌కు వెళ్లే మార్గంలో, అండర్ బ్రిడ్జి కింద, రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని పురుషుడి మృత దేహాన్ని స్థానికులు గుర్తించారు. వారు తెలిపిన సమాచారం మేరకు అతని వయసు సుమారు 45 నుండి 50 సంవత్సరాలు మధ్య ఉంటుంది. మృత దేహంపై ఎలాంటి గాయాలు లేవు. మృతుడు వంగ పూత రంగు షర్టు (నిలువుగా పెద్ద గీతలతో), నీలిరంగు గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. కుడి చేతికి ఎరుపు దారం కట్టబడి ఉంది. అతను రోజూ భిక్షాటన చేసి అదే ప్రాంతానికి వచ్చి నిద్రించేవాడని తెలుస్తోంది. చివరిసారిగా శుక్రవారం సాయంత్రం 6 గంటల వరకు చుట్టుపక్కల తిరుగుతున్నట్లు కనిపించినాడు. అతను అధిక మోతాదు మద్యం సేవించి మృతి చెందినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. తెలుగు, తమిళ భాషలు మాట్లాడేవాడని తెలిపారు. సంఘటన స్థలాన్ని వీఆర్వో యశోద పరిశీలించి, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వివరాలు తెలిసినవారు పుత్తూరు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో గానీ, 9440 796 727, 9440 796 728 నంబర్లకు గానీ సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

ఎర్రచందనం స్వాధీనం



ప్రజాశక్తి - (తిరుపతి) మంగళం: తిరుపతి జిల్లా, రంగంపేట మార్గంలో అక్రమ రవాణా చేస్తున్న 24 ఎర్రచందనం దుంగలతో పాటు, వాటిని తరలిస్తున్న కారును స్వాధీనం చేసుకుని, ఒకరిని టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆర్ఎస్ఏ ఎస్టీఎఫ్ హెడ్ సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణతో టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డిఎస్పీ బాలిరెడ్డి మార్గనిర్దేశకత్వంలో ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ లింగాధర్ టీమ్ శుక్రవారం నుంచి భాకరాపేట సెక్షన్ నాగపట్ల బీటు పరిధిలో కూంబింగ్ చేపట్టారు. శనివారం తెల్లవారుజామున రంగంపేట–శ్రీనివాసమంగాపురం రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా వేగంగా వచ్చిన ఒక కారు పోలీసులను చూసి కారు ఆపి ఒక వ్యక్తి దిగి పారి పోతుండగా అతనిని చుట్టుముట్టి అరెస్టు చేశారు. అతనిని తమిళనాడుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కారులో 24 ఎర్రచందనం దుంగలు ఉండగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.20 లక్షల విలువ ఉంటుందని అంచనా వేశారు. దుంగలతో సహా అరెస్టు అయిన వ్యక్తిని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ శ్రీనివాస రెడ్డి అతనిని విచారించగా, ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొన్న కారు.. ఒకరు మృతి



క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం
లారీని గుద్ది నుజ్జునుజ్జయిన కారు ముందు భాగం

ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని చావాలి చంబడి పాలెం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా నలుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే విజయనగరం నుండి తిరుపతి వెళ్లే క్రమంలో పెళ్లకూరు మండలం, చంబడి పాలెం వద్ద తిరుపతి వైపు వెళుతున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో, వెనుక వస్తున్న కారు లారీని ఢీకొనింది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని హైవే వాహనంలో శ్రీకాళహస్తి ఎంజిఎం ఆస్పత్రికి తరలించి, మెరుగైన చికిత్సకోసం మరో ఆస్పత్రికి తరలించే క్రమంలో విజయనగరానికి చెందిన సరస్వతి (50) మృతి చెందారు. నవ్య (26), లహరి(20), మీనా (45), సరస్వతిలను ఎంజీఎం నుండి రేణిగుంట అమర హాస్పిటల్‌కు తరలించే మార్గమధ్య లోనే సరస్వతి మృతి చెందింది. ఈ ఘటనపై పెళ్లకూరు పోలీస్ వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



చిట్టిబాబు మృత దేహం, ఇన్‌సెట్‌లో ఫైల్ ఫోటో

ప్రజాశక్తి - రామచంద్రపురం: తిరుపతి జిల్లా, తిరుపతి రూరల్ మండలం, నాయుడుపేట – పూతలపట్టు జాతీయ రహదారి గరుడాద్రి హౌసింగ్ కాలనీ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన టి.చిట్టిబాబు (39) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. స్థానికుల వివరాలు మేరకు రామచంద్రపురం మండలం, పరమాల నివాసితుడు చిట్టిబాబు శ్రీ చైతన్య కాలేజ్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి విధులు ముగించుకుని తన స్నేహితుడితో ద్విచక్ర వాహనంలో ఇంటికి వస్తుండగా, వాహనం నడిపే వ్యక్తి సడన్‌గా బ్రేక్ వేయడంతో అదుపుతప్పి వెనక కూర్చుని ఉన్న చిట్టిబాబు కిందపడిపోయాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయం అయింది. వెంటనే చికిత్స నిమిత్తం తిరుపతి రుయా హాస్పిటల్ కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్, సిమ్స్ హాస్పిటల్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సిమ్స్‌లో చిట్టిబాబు శుక్రవారం మృతి చెందారు. కేసు నమోదు చేసిన ఎంఆర్ పల్లి పోలీసులు శవ పంచనామా చేసి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పజెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిట్టిబాబు మృతికి పట్ల శ్రీ చైతన్య కాలేజీ యాజమాన్యం, మాజీ ఎంపీపీ తానికొండ కేశవుల నాయుడు, కోరా హరి ప్రసాద్ నాయుడు, లెక్కల సురేందర్ నాయుడు, ఎస్సి అధ్యక్షుడు మల్లంపల్లి చిరంజీవులు నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

బస్సును ఢీకొన్న కారు



ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలం, తాల్వాయిపాడు వద్ద జాతీయ రహదారిపై శనివారం ఉదయం తిరుపతి నుండి విజయవాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సు నాయుడుపేట వెళ్ళుటకు ఉన్నట్టుండి మలుపు తిరగడంతో, వెనుకనే బెంగళూరు నుండి నెల్లూరు వెళుతున్న ఇన్నోవా కారు బస్సును వేగంగా ఢీకొనింది. కారులో ప్రయాణిస్తున్న ఏడు మందిలో శ్రవణ్ కుమార్ రెడ్డి (40) రవీందర్ రెడ్డి (60) చంద్రకళ అను ముగ్గురు గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్న పెళ్లకూరు పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని హాస్పటల్ తరలించారు. పెళ్లకూరు ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు అదుపుతప్పి... డ్రైవర్‌కి గాయాలు



ప్రజాశక్తి -ఏర్పేడు : సీతారాంపేట రైస్ గోదాము వద్ద శనివారం రేణిగుంట నుండి ఏర్పేడు వైపు వెళుతున్న కారు అదుపుతప్పి సైడ్ కాలువలోకి దూసుకెళ్లడంతో డ్రైవర్‌కి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కారులో డ్రైవర్ ఒకరే ఉన్నారని, గాయపడిన డ్రైవర్ను హాస్పిటల్‌కు తరలించడం జరిగిందని తెలిపారు.